అనంతపురంలో ర్యాలీ చేస్తున్న వైసిపి శ్రేణులు

# రైతులను ఆదుకోవడంలో విఫలం

◆ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి
◆ పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలి
◆ నిరసన ర్యాలీలో వైసిపి శ్రేణులు

మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి -అనంతపురం**

తీవ్ర కరువు, దుర్భిక్షంలో ఉన్న అనంతపురం రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అన్నదాతలకు అండగా వైసిపి' నినాదంతో శుక్రవారం నగరంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిర్వహించారు. ముందుగా జెడ్పీ ఎదురుగా ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి సప్తగిరి సర్కిల్, సూర్య నగర్ రోడ్డు, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీని కొనసాగించారు. జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గాల సమన్వయకర్తలు విశ్వేశ్వరరెడ్డి, తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వీరాంజనేయులు, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మేయర్ వసీం ఇతర ప్రజాప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు ప్రసంగించారు. కరువు కాటకాలతో ఇబ్బందుల్లో ఉన్న రైతులకు తోడుగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించిందన్నారు. కేవలం 7 మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చి మిగితా మండలాలకు అన్యాయం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా మద్దతు ధర ప్రకటించినా జిల్లాలో పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఏటా రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చి దానిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ జరగలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలన్నారు. పంట ఉత్పత్తులకు అనుగుణంగా మద్దతు ధరలతో కొనుగోలు చేయాలన్నారు. రైతులపై ప్రీమియం భారం వేయకుండా 'ఉచిత పంటల బీమా'ను పునరుద్ధరించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేయాలన్నారు. ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా కింద పరిహారం చెల్లించాలన్నారు. 2023 రబీలో కరువు జాబితా ప్రకటించిన 17 మండలాల రైతులకు రూ.32 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే ఇవ్వాలని కోరారు. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థలో దళారుల ప్రమేయాన్ని అరికట్టాలి. రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే విత్తనాలు, ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్‌ను ఎమ్మార్పీ ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు ◆ సాయంత్రంలోపు ఫలితాలు వెల్లడి

పుట్లూరులో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవికి జరుగుతన్న ఈ ఎన్నికలు ఉదయం ప్రారంభమై మధ్యాహ్నం మూడు గంటల్లోపు ముగియనుంది. నామినేషన్ ప్రక్రియ అంతా పూర్తయ్యాక మూజువాని ఓటు ద్వారాగానీ, రహస్య ఓటింగ్ ద్వారా గానీ ఈ ఎన్నికల ప్రక్రియ జరుగనుంది.

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అనంతపురం జిల్లాలో మొత్తం 149 సాగునీటి సంఘాలు, ఆరు డిస్ట్రిబ్యూటరీ సంఘాలున్నాయి. మొత్తం 149 సాగునీటి సంఘాలు 54 భారీ సాగునీటి సంఘాలుండగా, ఆరు మధ్య తరహా ఉండగా, 89 చిన్ననీటి పారుదల సంఘాలున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 214 సూక్ష్మ సాగునీటి సంఘాలు, 16 మధ్యతరహా సంఘాలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు ఈనెల 17వ తేదిన ఎన్నికలు జరుగనున్నాయి. సాధారణ సాగునీటి సంఘాలకు మాత్రం శనివారం జరుగనున్నాయి. వీటిల్లో ఇప్పటికే ఓటరు నమోదు ప్రక్రియ కూడా పూర్తయింది. ఓటరుగా గుర్తింపున్న వారు మాత్రమే ఈ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశముంటుంది.

**ఏర్పాట్లు పూర్తి**

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. గ్రామ స్థాయిలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలు ఓటింగు వరకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నిర్వహణ ఏ విధంగా ఉంటుందన్న దానిపై ఇది వరకు శిక్షణ ఇచ్చియున్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కడా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన బందోబస్తు చర్యలపై పోలీసు శాఖ దృష్టి సారించింది.

**దశబ్దకాలం తరువాత ఎన్నికలతో గ్రామాల్లో హడావుడి**

సాగునీటి సంఘాల ఎన్నికలు 2015 తరువాత ఇప్పుడు జరుగుతున్నాయి. అంతకు మునుపు ఎన్నికైన సంఘాల పదవీకాలం 2020తో ముగిశాయి. అప్పటి నుంచి సంఘాల ఎన్నికలు జరగలేదు. ఇప్పుడు జరుగుతుండటంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. పోటీ చేసే అవుత్సాహికుల్లో ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికలు కసరత్తును పూర్తి చేశాయి. అధికార తెలుగుదేశం పార్టీ సాధ్యమైనంత వరకు ఏకగ్రీవం చేసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించింది. నియోజకవర్గాల వారిగా ఎమ్మెల్యేలు దీనిపై దృష్టి సారించారు. ఇప్పటికే ఆయా గ్రామాల నాయకులతో మాట్లాడారు. ఇందులో ఎన్నింటిని ఏకగ్రీవం చేసుకుంటారు.. లేక ఎన్నికలు జరుగుతాయన్నది చూడాల్సి ఉంది.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

## ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**ప్రజాశక్తి-గార్లదిన్నె**

వరి పంట పండించిన రైతులు ప్రయివేటు వ్యాపారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కల్లూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌డిఒ కేశవనాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్ కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు చేయగానే 48 గంటల్లోపు రైతు అకౌంట్లోకి డబ్బులు జమ చేస్తామన్నారు. ప్రభుత్వం క్వింటా వరి పంటకు రూ.2300 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. లోడింగ్ కూలీలు, రవాణా ఛార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. కావున రైతులు రైతు సేవాకేంద్రంలో పంట నమోదు చేసుకుని నేరుగా కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించుకోవాలని సూచించారు. కాగా గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే 90 శాతం డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు మంజూరు చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపిడిఒ యోగానందరెడ్డి, సివిల్ సప్లయి ఆఫీసర్ రమేష్‌రెడ్డి, కార్పొరేట్ విభాగం ఆఫీసర్ అరుణకుమారి, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టిడిపి నాయకులు



న్యాయవాదుల నిరాహార దీక్షకు మద్దతుగా హాజరైన ఎస్ఎఫ్ఐ నాయకులు

# న్యాయవాదుల నిరాహార దీక్ష

## జీవో 145ను రద్దు చేయాలి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ప్రజలు, న్యాయవాదులకు ఇబ్బందిగా తీసుకొచ్చిన జీవో 145ను తక్షణమే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కోర్టు కార్యాలయం ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 9 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఎన్.డి.పి.ఎస్ చట్టం కింది నేరాలను విచారించడానికి 5 ప్రత్యేక న్యాయస్థానలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం జి.ఓ.నెంబర్ 145 ను జారీ చేశారని తెలిపారు. ఇందుకు వ్యతిరేకంగా జి.ఓ.నెంబర్ 145 ను వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతపురం మొదటి అదనపు జిల్లా కోర్టులో జరుగుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులును తిరుపతిలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసి ఇక్కడున్న కేసులను అక్కడికి మర్చి తిరుపతిలోనే కేసులు నిర్వహించాలని జి.ఓ తీసుకురవడం సరికాదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి వెంటనే జీవోను రద్దు చేయాలన్నారు. దీక్షలకు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలిండియా లాయర్స్ యూనియన్ అనంతపురం జిల్లా అధ్యక్షులు వీరమసప్ప, జిల్లా కార్యదర్శి ఎమ్.సతీష్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు జి.సి.ప్రకాష్, న్యాయవాదులు ఎం.చంద్రశేఖర్, ఎం.లోకేష్, ఏ.శ్రీకాంత్, టి.సురేష్, వంశీ నాయక్, బి.గౌతమ్ రాజు, బి.పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక రవాణాను అరికట్టాలి

## మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నిర్మలాకుమారి

**ప్రజాశక్తి-శింగనమల**

మండలంలో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండలంలోని జూలాకాలువ సర్పంచి తరిమెల రాజారామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి యోగేశ్వరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ శాఖలో జరిగిన అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా జూలాకాలువ పంచాయతీలో నిరంతరాయంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, అయినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ ఇసుక రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం దురదృష్టకరమని పలువురు ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఇందుకు ఎంపిడిఒ జోక్యం చేసుకుని ఈ విషయం ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని, రానున్న రోజులోల ఇలాంటి తప్పు జరగకుండా తప్పకుండా ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, వైస్ ప్రెసిడెంట్ విజయ, నరసింహుడు, సిడిపిఒ ఉమాశంకరమ్మ, ఎపిఒ శ్రీదేవి, హౌసింగ్ డిఇ రమణమూర్తి, అగ్రికల్చర్ ఎఒ అన్వేష్‌కుమార్, విద్యుత్ ఎఇ విజయ్‌కుమార్, ఎంఇఒ నరసింహారాజు, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎపిఎం వీరన్నరప్ప, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు దేగల లలితమ్మ, రాజారామ్మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సరోజమ్మ, నాగమణమ్మ, రాజు, ఎంపిటిసిలు మొరార్జీ, రఘునాథ్‌రెడ్డి, జానగొండ చిన్న జయన్న, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి నిరసన

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో వైసిపి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోని వచ్చి ఆరునెలలు గడవక ముందే ప్రజలపై అనేక భారాలు మోపుతోందన్నారు. ముఖ్యంగా కరెంటు ఛార్జీలు మోపారన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాజ్‌కుమార్, వైస్ఎంపిపి రమేష్, ముక్కన్న, పరమేశ్వర, ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

# ఇసుక మేటలు పరిశీలన

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

ఇసుక మేటను పరిశీలిస్తున్న ఉపాధి హామీ పథకం పీడీ సలీంబాషా

మండలంలోని డి.హొన్నూరు గ్రామంలో ఏర్పడిన ఇసుకమేట్లను ఉపాధి హామీ పథకం పీడీ సలీంబాషా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తరలించడానికి రైతులు ముందుకొస్తే మూడు కిలోమీటర్ల నుంచి ఐదు కిలోమీటర్ల వరకూ ప్రభుత్వమే రవాణా ఖర్చులను భరిస్తుందన్నారు. అంతేగాకుండా రైతులు తమ పొలాలకు ఇసుకను తరలించుకునేందుకు సులువుగా ఉంటుందన్నారు. ఇసుక తరలించిన తర్వాత మొక్కలు పెంచితే భవిష్యత్తులో ఇసుక మేట్లు ఏర్పడకుండా అవకాశం ఉంటుందన్నారు. కావున రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అధికారులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు

# హెచ్చెల్సీ గండి పూడ్చివేత

హెచ్చెల్సీ గండి పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు, అధికారులు

**ప్రజాశక్తి-పుట్లూరు**

మండలంలోని చింతకుంట గ్రామ సమీపంలో హెచ్చెల్సీ 15వ కిలోమీటర్ వద్ద పడిన గండిని ఎట్టకేలకూ అధికారులు పూడ్చివేశారు. గత సోమవారం సాయంత్రం కాలువకు గండి పడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కోమటికుంట్ల చవ్వా కులశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులు శ్రమించి హెచ్చెల్సీకి పడిన గండిని పూడ్చివేశారు. ఈ సందర్భంగా చవ్వా కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చొరవతో హెచ్చెల్సీ అధికారులు రాత్రింబవళ్లు శ్రమించి హెచ్చెల్సీ గండిని పూడ్చివేశారన్నారు.

# యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

## సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

ఏరియా కోఆర్డినేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, యానిమేటర్లు

ఇటీవల తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏరియా కో ఆర్డినేటర్ నారాయణస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలగించిన యానిమేటర్లు కోర్టును ఆశ్రయిస్తే వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. సంబంధిత ఉత్తర్వులను జిల్లా డ్వామా పీడీ ఈశ్వరయ్యకు అందజేసినా యానిమేటర్ల విధుల్లోకి తీసుకోకపోవడం బాధాకరన్నారు. వెంటనే యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో తిరిగి కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, యానిమేటర్లు తిప్పేస్వామి, భీమప్ప, తిప్పేస్వామి, లోకేష్, వన్నూరుస్వామి, అంజనమ్మ, చెన్నకేశవ, పాతలింగ, తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక సెలవుపై కమిషనర్.?

## రాజకీయ ఒత్తిళ్లే కారణమా !




**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

అనంత కార్పొరేషన్‌పై రాజకీయ పెత్తనం అధికం అయినట్లు కన్పిస్తోంది. కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి రెండు నెలలు కాకమునుపే కమిషనర్ నాగరాజు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వహించడం కమిషనర్‌కు సాధ్యపడక, సెలవుపై వెళ్లేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. గతంలో నాలుగేళ్ల పాటు మున్సిపల్ ఆర్‌డిగా చేసిన అనుభవం కలిగిన నాగరాజు వైజాగ్ నుంచి అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలను స్వీకరించిన సమయంలో ఒత్తిళ్లను అధిగమించి సజావుగా పనిచేసుకుంటూ వెళ్తాననే ధీమాను ఉద్యోగుల వద్ద వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల అండతో సమస్యలను అధిగమించి తన ట్రేడ్ మార్క్ పాలన చూపిస్తానని కూడా చెప్పారు. ప్రజా ప్రతినిధి అండతో పాలన సాగిద్దామని వచ్చిన కమిషనర్ నాగరాజుకు రెండు నెలల్లోనే వాస్తవ పరిస్థితులు అవగతం అయ్యాయి. ప్రస్తుతం రాజకీయ ఒత్తిళ్లను తట్టుకోలేని పరిస్థితికి ఆయన వచ్చేసినట్లు తెలుస్తోంది. రెండు రోజులుగా తన ఛాంబర్‌కు కూడా ఆయన వెళ్లడం లేదు. గురువారం మధ్యాహ్న సమయంలో అదనపు కమిషనర్ ఛాంబర్‌లో కార్మిక నేతలతో చర్చలు జరిపిన తర్వాత అటు నుంచి అటే వెళ్లిపోయారు. ఫైళ్లపై సంతకాలు చేయించుకోవాలని వెళ్తున్న సిబ్బంది, కాంట్రాక్టర్లను కలిసేందుకు కమిషనర్ ఆసక్తి చూపడం లేదు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కమిషనర్ ఎక్కువగా ప్రజాప్రతినిధి నిర్ణయాలపైనే ఆధారపడేవారినే భావన కార్పొరేషన్‌లో ఉంది. ప్రస్తుతం ప్రజాప్రతినిధి ఒత్తిడి భరింపరాని స్థితికి చేరుకోవడంతో చేసేది లేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడమే మంచిదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏ కార్యాలయంలో అయినా రాజకీయ నాయకుల సూచనలు, సలహాలు ఇవ్వడం సాధరణమే అయితే పూర్తి స్థాయిలో వారు చెప్పినట్లు వినాలనే భావన కార్పొరేషన్‌లో ఉండడం సమస్యలకు కారణం అవుతోంది. సొంత నిర్ణయాలు తీసుకోకుండా పూర్తిగా ప్రజాప్రతినిధులపై ఆధారపడితే పరిస్థితి ఇలానే ఉంటుందని కొందరు ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. కమిషనర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పూర్తిగా ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఉంటూ పాలన సాగించటంతో రాజకీయ ఒత్తిళ్లు అధికమైనట్లుగా ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

గతంలో సైతం ప్రజా ప్రతినిధులు కార్పొరేషన్‌లో కర్రపెత్తనం చెలాయిస్తూ తమ బినామీల ద్వారా పనులు చేసుకుంటూ లబ్ధి పొందేవారు. అయినప్పటికీ ఆ నేత నమ్మకంగా పనిచేసిన అధికారులకే వెన్నుపోటు పొడవడంతో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేయటానికి అధికారులు ఎవరూ సుముఖత వ్యక్తం చేయని పరిస్థితి ఉండేది. ఇక్కడ ఉండలేక చాలా మంది వారికై వారు బదిలీలు చేయించుకుని వెళ్లారు. ఒకే ఏడాదిలో ఏడు మంది కమిషనర్లు బదిలీలపై వెళ్లారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. మళ్లీ అలాంటి పరిస్థితి అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పునరావతం అవుతుండడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ప్రజా ప్రతినిధి ముఖ్య అనుచరులు నిత్యం కమిషనర్ ఛాంబర్లోనే బైఠాయిస్తున్నారు. ఇది కూడా విధుల నిర్వహణకు కమిషనర్‌కు ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధి అనుచరులుగా పేర్కొంటూ అతిథి గహాలకు కాంట్రాక్టర్లను పిలిపించి అభివృద్ధి పనుల్లో తాము చెప్పిన వారే టెండర్లు వేయాలని, ఇతరులు వేయరాదని ఆంక్షలు విధించడం కూడా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో గత కొన్ని నెలలుగా కన్పిస్తోంది. దీంతో అభివృద్ధి పనుల్లో సైతం ప్రతిష్టంభన నెలకొంది. మూడు నెలల క్రితం ఇదే రీతిలో ఒక కాంట్రాక్టర్ ప్రజా ప్రతినిధి ముఖ్య అనుచరుడుగా పేర్కొంటూ బెదిరింపులకు పాల్పడి టెండర్లు రద్దు చేసుకోమనటం సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వెళ్లింది. ఈ అంశంలో ఆ ప్రజాప్రతినిధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్షింతలు వేసి క్లాసు పీకినట్టు చర్చ నడిచింది. అయినా వారి వైఖరిలో మార్పు రాకపోవడం గమనార్హం. టెండర్ వేసిన వారికి పనులు దక్కితే వాటిని రద్దు చేసుకోమనటం.. లేదా చేయలేమని లేఖలు అందించి పనులు వదులుకోవాలని హుకూం జారీ చేయడం లాంటి చర్యలు కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు విఘాతంగా మారింది. ఇటీవల థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ టెండర్‌లో సైతం ఇదే రకంగా అధికార గణం ప్రజాప్రతినిధి అనుచర వర్గం వ్యవహరించడంతో అర్హత కలిగి ఉండి టెండర్ దక్కించుకున్న కంపెనీకి వర్క్ ఆర్డర్ ఇవ్వని పరిస్థితి నెలకొంది. టెండర్లను అనర్హులకు కట్టబెట్టాలనుకుంటే లక్షలాది రూపాయలు వెచ్చించి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ పేరుతో టెండర్లు రెండుసార్లు నాలుగు పత్రికలకు అడ్వర్టైజ్మెంట్లు ఇవ్వకుండా ఉంటే బాగుండేదని ఉద్యోగ వర్గాల వ్యాఖ్యానిస్తున్నాయి. అన్నీ నిబంధనలు ప్రకారమే జరిగినట్లుగా చూపుతూ డొంక తిరుగుడుగా ఆ నేత అనుచర వర్గం వ్యవహరించటం కాంట్రాక్టర్లకు సైతం మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తగ్గట్టుగానే రెండోసారి టెండర్లు అర్హత కలిగిన వారికి దక్కినా దీనిపై గడచిన నాలుగైదు రోజులుగా చర్చోపచర్చలు జరుపుతూ సదరు కంపెనీకి వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఈ నెల 17వ తేదీన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల విషయమై పాలకవర్గం కార్పొరేటర్లు అధికారులను నిలదీసేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో అటు పాలకవర్గాన్ని ఇటు ప్రజాప్రతినిధిని కాదని వ్యవహరించటం కష్టమని భావించి ముందుగానే దీర్ఘకాలిక సెలవుపై వెళ్తే బాగుంటుందన్న యోచనలో కమిషనర్ నాగరాజు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం ఖాయమని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈయన సెలవుపై వెళ్తే గతంలో మాదిరిగా ఇక్కడ పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావడానికి ఇష్టపడరనే వాదన కూడా ఉద్యోగ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

# పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిద్దాం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

సాగునీటి సంఘం ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డిఓ వసంతబాబు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం ఆయా కేంద్రాల్లో తాగునీరు, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమతి, ఎంపిడిఓ నందకిషోర్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, ఇరిగేషన్ ఎఇ అనిల్, ఆర్డబ్ల్యుఎస్ జెఇ సుబ్బరాయుడు, ఎంఇఓ ఓబులేశు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ, ఖాసింబీ, అగ్రికల్చర్ అధికారి కృష్ణతేజ, ఎపిఎం వందరీశ్, తదితరులు పాల్గొన్నారు.

**కళ్యాణదుర్గంరూరల్ :** కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆర్‌డిఓ వసంత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆయా కేంద్రాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

**నార్పల :** మండలంలో ఆదివారం సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ అరుణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా బొందలవాడ, నార్పల, దుగుమర్రి, బి.పప్పూరు, చామలూరు, నడిమిదొడ్డి గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో 2,036 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

**పుట్లూరు :** మండలంలో ఆదివారం జరగనున్న సాగునీటి సంఘం ఎన్నికలపై శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శేషారెడ్డి ఎన్నికల్లో నిర్వహించవలసిన విధి, విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అలివేలమ్మ, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, పిఒలు, ఎపిఒలు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**యల్లనూరు :** మండలంలోని తిరుమలాపురం, యల్లనూరు కల్లూరు, వేములపల్లిలో సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు 4 డబ్ల్యుయుఎలకు నలుగురు ఇరిగేషన్ ఎఇలు, ఒక ఎఇ, 12 టిసిలకు 24 మంది ఎఇలను విధులకు కేటాయించినట్లు తెలిపారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

**కుందుర్పి :** సజావుగా సాగునీటి ఎన్నికలు నిర్వహిద్దామని తహశీల్దార్ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎఇ సంతోష్‌కుమార్, ఎంపిడిఒ లక్ష్మీశంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ మారుతి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**శింగనమల :** మండలవ్యాప్తంగా శుక్రవారం సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సాగునీటి ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలకుమారి, సిఐ కౌలుట్లయ్య, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ శరత్‌చంద్ర, అగ్రికల్చర్ ఎఒ ఆన్వేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి, నాగేపల్లి (కొత్తపేట), ఊబిచెర్ల, మాముడూరు, బాచుపల్లి చెరువులకు సంబంధించి మైనర్ సాగునీటి సంఘాలు, పెద్దొడ్డి 1,2,3, మాముడూరు, మార్నేంపల్లి, పామిడి మండలం అక్కజాంపల్లి సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా, ఇఒఆర్‌డి శివాజీ రెడ్డి, ఎంఇఒ రవినాయక్, పిఆర్ ఎఇఇ మల్లేష్‌నాయక్, మైనర్ ఇరిగేషన్ ఎఇఇ విజయ్‌కుమార్, ఎఇ ముస్తాక్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఆర్‌డిఓ వసంత్‌బాబు

జాబ్‌మేళాకు హాజరైన వారితో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

## మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నిరుద్యోగ యువత కోసం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జ్ఞానభారతి పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా సుమారు 200కుపైగా కంపెనీల ప్రతినిధులు తరలివచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకు నిరుద్యోగ యువత భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతంలో ఉన్న యువత నైపుణ్యం వృథా కాకూడదన్నారు. ఇందులో భాగంగానే మెగా జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల నిరుద్యోగులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అనంతపురం క్రైం :** నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డి5 ఎఇ మునిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా నారాయణపురం, తపోవనం, ఇందిరమ్మ కాలనీ, బళ్లారి రోడ్, నందమూరి నగర్, ద్వారకా విల్లాస్, స్టాలిన్‌నగర్, ప్రియాంక నగర్, కళ్యాణదుర్గం మెయిన్ రోడ్డు, శాంతినగర్, జొన్నా ఐరన్‌మార్ట్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, పాపంపేట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

# బాల్యవివాహాలపై అవగాహన

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెద్దముష్టూరు గ్రామంలో రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో శుక్రవారం పిసిపిఎన్‌డిటి, బాల్య వివాహాలపై నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ లింగవివక్ష సరికాదన్నారు. ఆడ, మగ పిల్లలిద్దరినీ సమానంగా చూడాలన్నారు. కొంతమంది లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి గర్భంలో ఉం ఆడశిశువని నిర్ధారించుకుని భ్రూణహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయరాదన్నారు. అబ్బాయిలు, అమ్మాయిలకు పెళ్లి వయస్సు వచ్చిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం ప్రకారం బాల్యవివాహాలను ప్రోత్సాహించినా, నిర్వహించినా జైలు శిక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ హిమబిందు, ఎఎన్ఎం హేమలత, హెల్త్ అసిస్టెంట్ రఘునాథ్, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

# 'పివికెకె'లో ఘనంగా ఫ్రెషర్స్ డే

విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిషోర్, సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేట వద్ద ఉన్న పివికెకె ఐటి డిప్లొమా కళాశాలలో 2వ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఘనంగా స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ మేయర్ కొగటం విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శిఖరాలను అధిరోహించాలంటే కష్టపడే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలంటే సంకల్ప బలంతోపాటు అంకిత భావం, స్వయం నియంత్రణను అలవర్చుకోవాలన్నారు. బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్ మాట్లాడుతూ పిల్లల క్రమశిక్షణ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని అందుకు తగ్గట్టుగా భావవ్యక్తీకరణను అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ జిఎన్ఎస్ వైభవ్, వైస్ ప్రిన్సిపల్ దీప్తిజోర్డన్, ఎఒ మనోహరరెడ్డి, డిప్లొమా విభాగాధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఇస్తేమా విజయవంతానికి సహకరించండి

ఆకుల బాబుతో చర్చిస్తున్న ముస్లిం మత పెద్దలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలో వచ్చేనెల 18, 19వతేదీల్లో నిర్వహించనున్న జిల్లాస్థాయి ఇస్తేమా విజయవంతానికి స్థలం ఇచ్చి సహకరించాలని పలువురు నాయకులను ముస్లిం నాయకులు కలిసి మంగళవారం విన్నవించారు. ఇస్తేమా జరుపుకునేందుకు నార్పల క్రాసింగ్‌లోని ఆకుల రామప్ప కుమారులు ఆకుల లక్ష్మీపతి తోట, సుబ్బిరెడ్డి స్థలాలను పరిశీలించి అనుకూలంగా ఉంటాయని ముస్లిము పెద్దలు నిర్ణయించారు. దీంతో ఆకుల విజయకుమార్ (బాబు), సుబ్బిరెడ్డి కుమారుడు గుత్తి ఫక్కిరెడ్డి, లాయర్ రవి, రమణారెడ్డి, నిరంజన్‌రెడ్డి, సురేష్‌రెడ్డిని కలిసి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఇస్తేమా నిర్వహణకు ఏమైనా అవసరం ఉంటే తన సహాయ, సహకారాలు ఉంటాయని ఆకుల విజయ్ కుమార్ (బాబు). తెలిపారు. అలాగే ఇస్తేమా విజయవంతానికి సహకారం అందివ్వాలని ముస్లిములు నార్పల సత్యనారాయణరెడ్డిని కలవగా ఆయన కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# నారాయణ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్‌లో నారాయణ జూనియర్ కళాశాల 10వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, ఎజిఎం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు నారాయణ కళాశాలలు వేదికలు అన్నారు. సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞతతో గమ్యం చేరాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అద్భుతమైన ప్రతిభతో మంచి మార్పులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు, రూ.10వేల నగదు బహుమతిని ఇచ్చి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, ఎజిఎం చెన్నకేశవులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

పామిడిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పామిడి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని టిడిపి నాయకులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ముందుగా మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కోసి పంచిపెట్టారు. అంబేద్కర్ సర్కిల్‌లో జనసేన నాయకుల ఆధ్వర్యంలో కేక్ కోశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, లంగాల గౌస్, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, ముసిలిరెడ్డి, బొమ్మా మోహన్, మహమ్మద్ రఫీ, కొట్టం మాలిక్, వడ్డే శివ, కొత్తపల్లి సుంకిరెడ్డి, సుంకప్ప, హమాలీ గోపాల్, గంపమల్లయ్య, కరూరు శివశంకర్, పత్రా శీన, అప్పన్నగారి కుమార్, ఎద్దులపల్లి జయ, కొండాపురం రంగస్వామి, రమణ, ఓబుల కిట్ట, బొమ్మా మురళి, ఆశిత్తు, ఓబులాపురం వెంకటేష్, అనుంపల్లి శీన, 4వ వార్డు రవి, 20వ వార్డు రాజు, పూజారి లక్ష్మీదేవి, జనసేన కొట్టాల సూర్యనారాయణ, వడ్డే రాము, నక్కల రామాంజనేయులు, వీరప్రతాప్, రాజు, నాగేంద్ర, షేక్షావలి, మురళి, సందీప్, నవీన్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పుట్టినరోజును పురస్కరించుకుని గుత్తి ప్రభుత్వాసుపత్రిలో టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో గర్భిణులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప, టిడిపి పట్టణ, మండల కన్వీనర్లు ఎంకె.చౌదరి, బర్దివలి, నాయకులు జక్కలచెరువు గోవిందు, బి.రమేష్, కోనంకి కృష్ణ, బి.వేణుగోపాల్, పి.సుధాకర్, సి.లక్ష్మణ్, జి.సుంకన్న, మోడే శ్రీనివాస్‌యాదవ్, ఎస్ఎం.బాషా, కోనంకి నాగేశ్వరరావు, బోర్‌వెల్ నాగరాజు, నరసింహులు, నారాయణస్వామి, రామకృష్ణ, న్యాయవాది సోము, తదితరులు పాల్గొన్నారు.

# ప్రహసనంలా పన్ను నోటీసుల జారీ ప్రక్రియ

## ఒకే రోజు 1200 సాధ్యం కాదన్న పోస్టల్ సిబ్బంది-74 షాపులకు మాత్రమే పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పన్ను బకాయిదారులకు పంపిణీ చేయాల్సిన నోటీసుల జారీ ప్రక్రియ ప్రహసనంగా మారింది. నగరంలో 1200 మంది మొండి బకాయిదారులకు శుక్రవారం ఒక్క రోజులోనే నోటీసులు పంపిణీ చేయాలని అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశులు నిర్ణయించారు. ఈ విషయమై పోస్టల్ విభాగంతో అధికారులు సంప్రదింపులు జరిపారు. శుక్రవారం ఒక్కరోజులోనే 1200 నోటీసుల పంపిణీ సాధ్యం కాదని పోస్టల్ సిబ్బంది తేల్చి చెప్పేశారు. 74 షాపులకు నోటీసులు అందించేందుకు పోస్ట్‌మ్యాన్ అంగీకరించి రసీదులిచ్చి వాటిని మాత్రమే తీసుకెళ్లారు. మిగతా 1126 నోటీసుల పంపిణీకి సచివాలయ సిబ్బందిని వినియోగించేందుకు కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. ఆయా సచివాలయ పరిధిలోని పన్ను మొండి బకాయిదారులకు ఇచ్చేలా నోటీసులను సచివాలయ సిబ్బందికి అందజేశారు. పన్ను మొండిబకాయిలకు సంబంధించి శనివారం జరగనున్న లోక్‌అదాలత్‌లో విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో నోటీసులు ముందుగా మొండి బకాయిదారులకు అందజేసి ఉంటే వారు డబ్బు సమకూర్చుకుని లోక్‌అదాలత్ వేదికగా చెల్లించుకునే వీలుండేది. అదనపు కమిషనర్ డిప్యూటీ కమిషనర్‌లు నోటీసుల పంపిణీ అంశాన్ని తేలిగ్గా తీసుకోవడంతో పన్నుల వసూలు ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నాయి. రెవెన్యూ విభాగంపై ఇద్దరు అధికారుల అజమాయిషీతో సిబ్బంది విధులు రెండు పడవల ప్రయాణంలో సాగుతోంది. రెవెన్యూ విభాగం పర్యవేక్షణ ఒక అధికారి ఆధ్వర్యంలో కొనసాగితే ఇలాంటి సమయాల్లో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. రెవెన్యూ విభాగం పర్యవేక్షణ అటు అదనపు కమిషనర్, ఇటు డిప్యూటీ కమిషనర్ల ఇద్దరి ఆధ్వర్యంలో ఉండడంతో ఎవరికి వారు వారి నిర్ణయాలను కింది స్థాయి సిబ్బందిపై రుద్దుతున్నారు. ఆర్థిక ప్రయోజనం కలిగించే పన్ను వసూళ్లలో అధికారులు అనాలోచిత నిర్ణయాలతో కార్పొరేషన్‌కు నష్టం జరిగిందనే వాదన ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది. ఆస్తి, నీటి పన్ను వసూళ్ల వ్యవహారంలో మున్సిపల్ మాన్యువల్ ప్రకారం సూచించిన పలు రకాల చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ఆ దిశగా చర్యలు చేపట్టడానికి అధికారులు ఆసక్తిని కనపరచకపోవటం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియటానికి నాలుగు నెలల సమయం మాత్రమే ఉంది. ఈ పరిస్థితుల్లో పన్ను వసూళ్లను వేగవంతం అవుతుందా.. లేదా.. అన్న దానిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

## హనుమద్ వ్రతం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ ఇఒ వాణి ఆధ్వర్యంలో శుక్రవారం హనుమద్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. 41 రోజులు దీక్ష అనంతరం దీక్షాపరులు పేదపండితులతో స్వామివారి నామాలు జపంచారు. ముందుగా ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తికి తిరుమంజని సేవ, వివిధ సుగంధ ద్రవ్యాల అభిషేకాలు, సహస్ర దారాభిషేకం చేశారు. తర్వాత వివిధ పండ్లు, పూలతో అలంకరించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు స్వామివారి విశేష వస్త్రాలను తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ప్రధాన అర్చకులు గరుడ స్వామి, అర్చకులు అనంత పద్మ, ఆవశర్మ వారి అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా హనుమజ్జయంతి

**యల్లనూరు :** మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో వెలసిన అతి పురాతన అభయాంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హోమాలు, సీతారామ కళ్యాణ కంకణం, రాజరాజేశ్వరి అమ్మవారి కలషపూజ నిర్వహించారు.

## 15లోపు పంటల బీమా చేసుకోండి

**పుట్లూరు :** మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వతేదీలోపు బీమా ప్రీమియం చెల్లించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కాత్యాయిని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. అలాగే పంటల బీమా చేసుకున్న ప్రతి రైతూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. అప్పుడే బీమాకు అర్హులు అవుతారన్నారు. కావున మండల రైతులు బీమా ప్రీమియం చెల్లించుకోవడంతోపాటు ఈపంట నమోదు చేయించుకోవాలని కోరారు.

## 15న రాయలసీమ మహా కవిసమ్మేళనం

పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 15వతేదీన రాయలసీమ మహాకవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. సమ్మేళనంలో రాయలసీమ ప్రముఖులపై 140 మంది కవులు కవితాగానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు రవికుమార్, నాగశేషారెడ్డి, వన్నూరుసాబ్, తమ్మారెడ్డి, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వరి పంట సాగు చేసిన రైతులు గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర క్వింటా రూ.2320తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా వరి పంటను తేమశాతం 17శాతం ఉండేవిధంగా ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## విఆర్ఎ మృతికి నివాళి

ప్రజాశక్తి-పామిడి

అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని నీలూరు విఆర్ఎ తలారి లింగన్న (58) మృతికి పలువురు నివాళులర్పించారు. లింగన్న గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, డిటి లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్ఐ విజయ్‌కుమార్, వీఆర్వోలు, తోటి విఆర్ఎలు సంతాపం తెలిపారు. తర్వాత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి విఆర్ఎ కుటుంబానికి రూ.25వేల ఆర్థికసాయం అందించారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం

విజిలెన్స్, ఎన్‌ఫో ర్స్‌మెంట్ అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు శుక్రవారం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని గ్రీన్ గ్రో న్యూట్రియంట్ ఎరువుల డిస్ట్రిబ్యూటర్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో ఉన్న లక్ష్మీ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఫెర్టిలైసెర్స్), ఆగ్రో-న్యూట్రీ ప్రయివేట్ లిమిటెడ్, రాప్తాడులోని ఆవేజ్ (అవంతి) దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రికార్డులు, స్టాకుల్లో వ్యత్యాసం ఉండటంతో నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగభూషణం, శ్రీనివాసులు, ఎస్.జమాల్‌బాషా, వాసుప్రకాష్, డి.విజయలక్ష్మి, సురేష్‌కుమార్, శశికళ, మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఉరవకొండ సిడిపిఒ బిఎన్.శ్రీదేవి సూచించారు .శుక్రవారం ఉరవకొండలోని 13, 22వ అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పౌష్టికాహారంతోపాటు ఇళ్లలో కాయగూరలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, మునగాకు వంటివి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి, కార్యకర్తలు శ్వేతనాగు, సంతోషి, అంగన్వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిడిపిఒ శ్రీదేవి

## వైసిపి శ్రేణుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైసిపి నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి నీలం భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను గాలికి వదిలేసిందన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు అండగా ఉంటామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నట్టేట ముంచారన్నారు. రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తానన్న పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. అనంతరం జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న నిరసన ప్రదర్శనకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేష్, సర్పంచి పార్వతీ, ఎంపిటిసిలు వెంకట శివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ఈనెల 14వ తేదీ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక రైల్వే మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యుడు మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న కబడ్డీ క్రీడాకారులు సెల్..94410 53041, 99662 24669 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## ఫ్యాక్షన్ జోలికెళ్తే జీవితాలు నాశనం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామస్తులు ఫ్యాక్షన్ జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మేడిమాకులపల్లి గ్రామంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రౌడీషీటర్ల ఇళ్లు, గడ్డివాములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామస్తులు ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఫ్యాక్షన్ జోలికి వెళ్తే కేసులు నమోదై జీవితాలు నాశనం అవుతాయని సూచించారు. ఇకపోతే సైబర్ నేరాలు, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## నేటి నుంచి 'ఉపాధి'పై గ్రామసభలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై శనివారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సొలమన్‌రాజ్, ఎపిఒ పోలేరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని బుక్కరాయసముద్రం, సిద్ధరాంపురం, కొర్రపాడు, దయ్యాలకుంటపల్లి, వడియంపేట, చెన్నంపల్లి, పొడరాళ్ల, చెదుల్ల, బి.కొత్తపల్లి, రెడ్డిపల్లి, రేగడి కొత్తూరు, పసలూరు, నీలంపల్లి, జంతులూరు, వెంకటాపురం, దండువారిపల్లి, బొమ్మలాటపల్లి, కేకే అగ్రహారం, గోవిందంపల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేయనున్నట్లు తెలిపారు.

## డ్రైడే పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

పరిసరాలను పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం డి.హీరేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మడేనపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో చేపట్టిన డ్రైడేను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం నీటి కుంటల్లో వేస్ట్ ఆయిల్ బాల్స్ వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రాజశేఖర్, ఎఎన్ఎం పార్వతి, ఎంఎల్‌హెచ్‌పి భువనేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ శివ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## 17న విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

**ఉరవకొండ :** ఈనెల 17న విశ్రాంత ఉద్యోగుల జాతీయ దినోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు కిష్టప్ప, కార్యదర్శి ఎన్.వెంకటస్వామి, కోశాధికారి ఎన్.నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరవకొండలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 70ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ సన్మానించనున్నట్లు తెలిపారు.

## నేడు మెగా జాబ్‌మేళా

**ఉరవకొండ :** మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో శుక్రవారం ఉరవకొండలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు పయ్యావుల విక్రమసింహా, పయ్యావుల విజయసింహా తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్తకు పరామర్శ

**బ్రహ్మసముద్రం :** మండల పరిధిలోని ఎర్రకొండాపురం గ్రామానికి చెందిన గొళ్ల రామలింగను టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇంటికి చేరుకున్న గొళ్ల రామలింగను పరామిర్శంచి భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

## నేరాలు ఘోరాలు

### వక్క చెట్లు అగ్నికి ఆహుతి


కాలిన వక్క తోట వద్ద బాధిత రైతు

**కుందుర్పి :** మండల పరిధిలోని మలయనూరు గ్రామానికి చెందిన రైతు మంజునాథకు చెందిన 600 వక్కమొక్కలు శుక్రవారం అగ్గికి ఆహుతయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు... ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వక్కచెట్లు నిప్పు పెట్టారా, ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారో అర్థం కావడం లేదని వాపోయాడు. ఫలితంగా సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.